క్లుప్తంగా

సీనియర్ సిటిజన్స్ యోగా హంగామా



శిల్పారామంలో గురువారం యోగాసనాలు సాధన చేస్తున్న సీనియర్ సిటిజన్స్

పీఎం పాలెం: ప్రపంచ యోగాలో గిన్నిస్ రికార్డును సాధించడానికి మేము సైతం అంటూ జాతర వాకర్స్ సీనియర్ సిటిజన్స్ గురువారం ఉదయం ఉదయం 6 గంటలకు యోగాసనాల సాధన చేశారు. శనివారం ఉదయం 4 గంటలకే సీనియర్ సిటిజన్స్ అందరూ శిల్పారామం ప్రధాన గేటు వద్దకు చేరుకునేందుకు నిర్ణయించుకున్నారు. గురువులు కనకరాజు, మురళీగోవింద్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణయ్య, చిరంజీవి, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

వేములవలస మార్కెట్‌కు నేడు సెలవు

తగరపువలస: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ పువ్వుల మార్కెట్‌కు శనివారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ తరఫున దండోరా వేయించారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సూచనల ప్రకారం ప్రకటించిన సెలవును రైతులు, వ్యాపారులు, వినియోగదారులు పాటించాలని కోరారు.

నేడు ఉదయం 11 గంటల తరువాతే నీటి సరఫరా

తగరపువలస: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ భీమిలి జోన్‌లోని 1 నుంచి 4 వార్డుల ప్రజలకు శనివారం ఉదయం 11 గంటల తరువాత నుంచే తాగునీరు సరఫరా చేయనున్నారు. ప్రతిరోజు సరఫరా చేసే సమయం కాకుండా ఈ ఒక్కరోజు మార్పు చేసినట్లు నీటి సరఫరా విభాగం సిబ్బంది తెలిపారు.

వీధికుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు



ప్రణీత్ తలపై గాయాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ ఎస్సీ కాలనీలో శుక్రవారం వీధికుక్కల దాడిలో వై.ప్రణీత్(9) అనే 4వ తరగతి విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతని తలపై తీవ్రంగా గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో ఉంచి, చికిత్స చేయిస్తున్నారు. ఒక కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న క్షతగాత్రుడు పాఠశాలకు వెళ్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. కాలనీలో వీధికుక్కలు తరచూ దాడులు చేస్తున్నందున వాటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారిపై అడ్డంకుల తొలగింపు



రోడ్డుపై అడ్డంకులు తొలగించడంతో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం: స్థానిక దుర్గాలమ్మ గుడి వద్ద సర్వీసు రోడ్డులో అడ్డంకులను అధికారులు శుక్రవారం తొలగింపజేశారు. రోడ్డును మూసివేయడంతో జీవీఎంసీ 6వ వార్డులోని సాయిప్రియ లేఅవుట్ ప్రాంతంలో నివసిస్తున్న వారు పడుతున్న ఇబ్బందులపై ‘ రహదారి మూసివేతతో స్థానికుల ఇక్కట్లు’ శీర్షికన శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దుర్గాలమ్మ గుడి వద్ద సర్వీసు రోడ్డులో అడ్డంగా వేసిన కాంక్రీట్ దిమ్మలను సంబంధిత అధికారులు తొలగింపజేశారు. దీంతో ఆ ప్రాంత వాసులు నగరం వైపునకు రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అయింది.

యోగాంధ్రకు సర్వం సిద్ధం

- గుడ్లవానిపాలెం బీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు బారికేడ్లు
- రోడ్డంతా గ్రీన్ మ్యాట్
- ఎల్‌ఈడీ స్క్రీన్లు, మైక్ సెట్ల ఏర్పాటు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా



కార్యక్రమం జరిగే చోట ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

కొమ్మాది: బీచ్‌రోడ్డులో శనివారం ఉదయం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సర్వం సిద్ధం అయింది. గుడ్లవానిపాలెం బీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు బారికేడ్లు కట్టి, రోడ్డంతా గ్రీన్ మ్యాట్ వేసి, హైమాస్ట్ లైట్లు, మైక్ సెట్స్, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఎవరు ఏ కంపార్టుమెంటులో ఉండాలి అనేది ఆ ప్రాంత సచివాలయ అధికారులు ముందుగా అందరికీ సమాచారం అందించారు. ప్రధానంగా రుషికొండ జంక్షన్, సాగర్‌నగర్ జంక్షన్, ఐటీ జంక్షన్, తిమ్మాపురం జంక్షన్, నగరపాలెం, చేపలుప్పాడ జంక్షన్ల వద్ద ఏర్పాట్లతో పాటు పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఇవి ప్రధాన కూడళ్లు కావడంతో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సూచనలు చేశారు.

అధికారుల పరిశీలన

ప్రధాన అధికారులతో పాటు జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కేతన్ గార్గ్ రుషికొండ, ఎండాడ, మంగమారిపేట, సాగర్‌నగర్ ప్రాంతాల్లో యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. యోగాంధ్రకు వాహనాలు, ద్విచక్రవాహనాలు, కార్ల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాలు, సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ తెల్లవారుజామున 5 గంటలకు కేటాయించిన కంపార్టుమెంట్లకు చేరుకోవాలని ప్రజలకు సూచించారు.

భీమిలి బీచ్ రోడ్డులో..

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో ఉమర్ అలీషా ఆశ్రమం వరకు ఉన్న డబుల్ రోడ్డు పూర్తయి చివరి వేదిక వరకు రోడ్డు మొత్తం కార్పెట్‌ను ఏర్పాటు చేశారు. నిర్దేశించిన పాయింట్ల వద్ద వేదికలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మొబైల్ టాయిలెట్లు, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నారు. హై ఫ్రీక్వెన్సీ సిగ్నల్ ఉండేలా బీఎస్‌ఎన్‌ఎల్ తాత్కాలిక మొబైల్ టవర్లను ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఏర్పాట్లు పరిశీలించి, అధికారులకు సూచనలను అందించారు.



మంగమారిపేటలో పూర్తయిన ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కేతన్ గార్గ్



బీఎస్‌ఎన్‌ఎల్ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టవర్



లా కాలేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్



బీచ్ రోడ్డులో గ్రామాలకు వెళ్లకుండా అడ్డంగా వేసిన బారికేడ్లు

రాకపోకలకు అంతరాయం

యోగాంధ్ర ఏర్పాట్లలో తీర ప్రాంత వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. బీచ్ రోడ్డు చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ ఏర్పాట్ల నేపథ్యంలో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడటం, బీచ్ రోడ్డు వెంబడి ఉన్న దుకాణాలకు అడ్డంగా బారికేడ్లు కట్టడంతో చిరు వ్యాపారులు కాస్త అసహనానికి గురవుతున్నారు.

పర్యాటక ప్రాంతాలు వెలవెల

ఇప్పటికే బీచ్ రోడ్డులో ప్రధాన వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. పర్యాటక ప్రాంతాలైన రుషికొండ, తొట్లకొండ సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల రాకపోకలు కూడా నిలిపివేయడంతో ఈ ప్రాంతాలన్నీ వెలవెల బోతున్నాయి.



బోసిపోయిన రుషికొండ బీచ్

పోలీసు అధికారుల పరిశీలన



తిమ్మాపురం రోడ్డులో ఆదాని హిల్ పాయింట్ వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న డీఐజీ

మధురవాడ: యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి మధురవాడ జోన్‌లోని పీఎం పాలెం, ఎన్‌వీపీ కాలేజీ రోడ్డు, పనోరమ హిల్స్ ఆదానీ హిల్ పాయింట్ వద్ద ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను డీఐజీ విజయరావు, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు పరిశీలించారు. విద్యార్థులు, ప్రజలు తమకు కేటాయించిన కంపార్ట్‌మెంట్‌లకు సులభంగా చేరుకునే విధంగా, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని వారు అధికారులను ఆదేశించారు.

గడ్డి మందు తాగి యువకుడి మృతి



పైడా అప్పలరాజు (ఫైల్ ఫొటో)

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ గొల్లవీధికి చెందిన పైడా అప్పలరాజు (27) మనస్థాపానికి గురై, గడ్డి మందు తాగి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఈ మేరకు మృతుని తల్లి వెంకటలక్ష్మి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. సూరిబాబు, వెంకటలక్ష్మి దంపతులకు అప్పలరాజు, చంద్రశేఖర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పలరాజు డిగ్రీ పూర్తి చేసి వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఏడాది క్రితం అప్పలరాజు దుబాయ్‌లో వెల్డింగ్ పనులకు ఢిల్లీ ఏజెంటు ద్వారా ఎంపికై, వీసా కోసం రూ.1.50 లక్షలు చెల్లించి మోసపోయాడు. దీంతో మనస్థాపం చెంది అప్పట్లో పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ నెల 15న దుబాయ్ వెళ్లడానికి మరో అవకాశం రాగా రూ.లక్ష ఏర్పాటు చేయమని తల్లిదండ్రులను కోరాడు. దీనికి వారు నిరాకరించి, బయట దేశాలకు వద్దని, తమ్ముడు చంద్రశేఖర్‌తో కలిసి విశాఖలోనే వెల్డింగ్ పనులు చేసుకోవాలని చెప్పారు. దీంతో అప్పటి నుంచి ఇంట్లో భోజనం మానేశాడు. ఈ నెల 19న తల్లి వెంకటలక్ష్మిని పని ప్రదేశంలో దించి ఇంటికి వచ్చాడు. ఉదయం 11.30 సమయంలో ఇంటికి వచ్చిన తల్లి భోజనం పెట్టేందుకు పక్క గదిలో పడుకున్న పెద్ద కుమారుడిని తలుపు తట్టి లేపే ప్రయత్నం చేయగా, పలికినా బయటకు రాలేదు. తరువాత పిలుద్దామని ఆమె ఊరుకుండిపోయింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తండ్రి సూరిబాబు వచ్చి భోజనానికి తలుపు కొట్టగా అప్పలరాజు తలుపు తీసి, కింద పడిపోయాడు. ఆ సమయంలో మంచంపై వాంతి చేసుకోవడంతో పాటు పక్కనే గడ్డి మందు బాటిల్ కనిపించింది. అది తాగినట్టు గుర్తించిన తల్లిదండ్రులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 12.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఎస్‌ఐ జి.సంతోష్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ సత్తిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అప్పలరాజు అవివాహితుడు.

యోగాంధ్రకు భీమిలి నుంచి 75వేల మంది..

- ఒక్కో సచివాలయానికి 7 బస్సులు కేటాయింపు
- వేకువజామున 4 గంటల నుంచి కంపార్ట్‌మెంట్లకు తరలింపు



చిట్టివలస బంతాట మైదానంలో అందుబాటులో ఉంచిన బస్సులు



బీచ్ రోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

తగరపువలస: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బీచ్‌రోడ్డులో జరగనున్న యోగాసనాల్లో పాల్గొనేందుకు భీమిలి నియోజకవర్గం నుంచి 75 వేల మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిసింది. వీరిలో మధురవాడ జోన్ నుంచి 25 వేల 200 మంది, భీమిలి జోన్ నుంచి 12 వేల 600 మంది, పద్మనాభం నుంచి 143 బస్సుల్లో 7150 మంది, ఆనందపురం నుంచి 8 వేలమందిని తరలిస్తున్నారు. ఒక్కో సచివాలయ పరిధిలోని గ్రామాలకు 7 బస్సులు కేటాయించారు. నియోజకవర్గంలోని భీమిలి, మధురవాడ జీవీఎంసీ జోన్‌లతో పాటు భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలలో 159 వరకు సచివాలయాలు ఉన్నాయి. వీటికి ఉమ్మడి జిల్లాలోని బస్సులతో పాటు కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు పెద్ద ఎత్తున తరలించారు. అంతేకాకుండా ఉత్తరాంధ్రలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి కూడా పూర్తిగా యోగాంధ్ర కోసం బస్సులను తరలించారు. వీటన్నింటి వివిధ వర్గాల ప్రజలతో వేకువజామున 4 గంటలకే నింపి యోగాసనాల కోసం కేటాయించిన కంపార్ట్‌మెంట్లకు తరలించడానికి ఉద్యోగులు శ్రమిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి తప్పక పాల్గొనాలని బతిమాలుతున్నారు. ఇదిలా ఉండగా ఉదయాన్నే కార్యక్రమం కావడంతో యోగాసనాలు ఏర్పాటు చేసిన చోట వాష్‌రూమ్‌ల పరిస్థితిపై పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. యోగాసనాలు వేసే బీచ్‌రోడ్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఉద్యోగులతో శుక్రవారం ఉదయం ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.

జోన్–2 నుంచి 40,400 మంది

మధురవాడ: యోగాంధ్రకు జీవీఎంసీ జోన్–2 పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జెడ్సీ కొట్యాడ కనకమహాలక్ష్మి తెలిపారు. జోన్‌లోని భీమిలి నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 25,200మంది, తూర్పు నియోజకవర్గం నుంచి 15,200మందిని తరలిస్తున్నట్టు తెలియజేశారు. వార్డు సచివాలయానికి 7బస్సులు చొప్పున మొత్తంగా 532 బస్సులు, 400ఆటోలు ద్వారా ప్రజలను తరలిస్తున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వారిని సాంకేతిక కళాశాల, డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీ క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్ సీ 26 నుంచి సీ 36, మరియు ఏ 16, 17 కంపార్ట్‌మెంట్లకు తరలిస్తున్నారు. అలాగే కంబాలకొండ, బీచ్ రోడ్డు పరిసర ప్రాంతాలకు తూర్పు నియోజకవర్గానికి చెందిన వారిని తరలిస్తున్నట్టు జెడ్సీ తెలియజేశారు.

నిలిచిన పారిశుధ్య పనులు



సంతబయలు వద్ద తొలగించని చెత్త

తగరపువలస: యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో జీవీఎంసీ భీమిలి జోన్‌లో రెండు రోజుల నుంచి చాలావరకు పారిశుధ్య పనులు నిర్వహించలేదు. పారిశుధ్య సిబ్బందిని యోగాసనాలు వేసే బీచ్ రోడ్డు పనులకు కేటాయించడంతో, మిగిలిన ప్రాంతాల్లో పనులు నిలిచిపోయాయి. ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. డ్రైనేజీలు మురిగిపోవడంతో ఈగలు, దోమలు ముసురుకుంటున్నాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లమీదుగా ప్రవహిస్తున్నాయి. శనివారం కూడా పారిశుధ్య పనులకు ఆటంకం ఏర్పడనుంది. ఆదివారం సెలవు కావడంతో తిరిగి సోమవారమే పారిశుధ్య సిబ్బంది సాధారణ విధులకు హాజరయ్యే అవకాశం ఉంది. నాలుగు రోజుల పాటు ప్రధాన మార్గాలలో పారిశుధ్య పనులు చేపట్టకుంటే అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పారిశుధ్య పనులు నిలిచిన చోట శనివారం పాక్షికంగా అయినా చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా శివారు గ్రామాల్లో పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు వేళాయె..

- మధురవాడలో 3 వసతి గృహాలు
- 1 పాఠశాల, 2 కళాశాల హాస్టల్స్
- ప్రారంభమైన అడ్మిషన్స్



మధురవాడలోని సమీకృత బాలుర వసతి గృహం



అడ్మిషన్స్ గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్న వార్డెన్ రమేష్

మధురవాడ: ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలోని మధురవాడలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 2 కళాశాల, 1 సమీకృత బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వీటికి గత ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచడంతో భోజనంలో నాణ్యతతో పాటు ఉదయం సాయంకాలం స్నాక్స్ అందిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, దుప్పట్లు, కాస్మొటిక్ చార్జీలు కూడా అందజేస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు అదనంగా ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో బాల, బాలికలకు ప్రభుత్వం ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తోంది. పాఠశాల స్థాయిలో బీసీ విద్యార్థులకు కూడా సీట్లు ఖాళీ ఉన్నాయి. వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చును. కళాశాల వసతి గృహాల్లో అడ్మిషన్ల కోసం వార్డెన్లను సంప్రదించవచ్చు. అడ్మిషన్స్‌లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే నేరుగా మమ్మల్ని 94902 235594 నంబరులో సంప్రదించవచ్చు.

– జి.రమాదేవి, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, భీమిలి

సమీకృత బాలుర వసతి గృహం



సువిశాల హాస్టల్ వరండా


ఇటీవల రూ.32 లక్షలతో అన్ని హంగులతో మరుమ్మతులు పూర్తి చేసుకుంది ఈ భవనం. 2025–26 విద్యాసంవత్సరంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఖాళీల వివరాలు : ఎస్సీ : 115, ఎస్టీ : 41, బీసీ : 109, మైనార్టీ, ఇతర కులాలు : 44, మొత్తం ఖాళీలు : 309

వసతులు ఇవీ..

- ఇక్కడ ఉచిత విద్యతో పాటు వసతి, పౌష్టికాహారం, దుస్తులు, రగ్గు, దుప్పటి.. ప్రత్యేకంగా కంచం, గ్లాసు, ట్రంకు పెట్టె తదితర వస్తువులు ఉచితంగా సమకూరుస్తారు.
- హాస్టల్ భవనం, సువిశాల పరిసరాలు, ప్రతి గదికి లైట్లు, ఫ్యాన్లు
- 2వేలు లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్
- సువిశాల ఆట స్థలం, ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు
- విద్యలో ప్రత్యేక శిక్షణ
- డైనింగ్ హాల్

కళాశాల హాస్టల్స్



మధురవాడలోని కళాశాల బాలుర హాస్టల్

మధురవాడలోని కరెంట్ ఆఫీసుకు సమీపంలో బాలురకు, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ వద్ద బాలికలకు వేర్వేరుగా కళాశాల విద్యార్థులకు హాస్టల్స్ ఉన్నాయి. ఇక్కడ ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదువుతున్న వారికి వసతి కల్పిస్తారు. బాలుర హాస్టల్‌లో 100 సీట్లు, బాలికల హాస్టల్‌లో 150 సీట్లు ఉన్నాయి. ఇక్కడ విద్యార్థులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు.

హాస్టల్స్‌లో ప్రవేశాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు

వసతి గృహం	సీట్లు	డబ్ల్యూహెచ్‌వో	ఫోన్ నంబర్
సమీకృత వసతి గృహం, మధురవాడ	309	రమేష్	91548 79173
కళాశాల వసతి గృహాలు			
బాలుర వసతి గృహం, మధురవాడ	100	ఆర్.ప్రసాద్	95532 18772
బాలికల వసతి గృహం, పరదేశిపాలెం	150	మోహిని	92900 43600

‘ఆట’విడుపు



సంగివలస కొండప్ప చెరువు పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

తగరపువలస: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులకు ఆటవిడుపు లభించినట్టయింది. సంగివలస కొండప్ప చెరువును ఆనుకుని ఉన్న పార్కులో సాయంత్రం వేళ పిల్లలు సందడి చేశారు. ఇటీవలే దివీస్ లేబరేటరీ యాజమాన్యం కొత్త ఆట వస్తువులను ఏర్పాటు చేయడంతో ఉత్సాహంగా ఆటల్లో నిమగ్నమయ్యారు. సిమెంట్ బెంచీల వద్ద, హట్‌ల వద్ద పెద్దలు కాలక్షేపం చేశారు.

యోగాంధ్రకు 12వేల మంది విద్యార్థులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 12,800 మంది విద్యార్థులు ‘యోగాంధ్ర’ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్ తెలిపారు. వీరిని తరలించడానికి 238 బస్సులు కేటాయించారు. ప్రతి బస్సుకు ఒక జూనియర్ లెక్చరర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. 88 బస్సులలో 4,466 మంది ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రౌండ్‌లో జరిగే ‘యోగాంధ్ర’ కార్యక్రమంలో 4 కంపార్ట్‌మెంట్లలో పాల్గొంటారు.